జననీ జన్మభూమిశ్చ

పల్లెల వికాసానికి ముందుకొచ్చిన ఎన్.ఆర్.ఐ.లు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20
(ప్రభావార్త ప్రతినిధి)

జననీ జన్మభూమిశ్చ... స్వర్గాదపి గరీయసీ...! అన్నాడో మహాకవి. ఆ మాటల్ని అక్షరాలా నిజం చేస్తూ జిల్లాకు చెందిన ఎన్.ఆర్.ఐ.లు తమ ప్రాంత అభివృద్ధికి నడుం బిగించారు. తమను పెంచి పెద్ద చేసిన ప్రాంత వికాసానికి చేతనైన మేరకు చేయూత నిచ్చేందుకు పూనుకున్నారు. ఇతర దేశాల్లో ఉన్న ప్రముఖులు ఇప్పటికే పాలమూరు ఎన్.ఆర్.ఐ. ఫోరం పేరుతో ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సహకారంతో విడుదల చేసిన క్యాలెండర్‌లో పాలమూరు జిల్లాకు కూడా ఒక పేజీ ఉండేలా ఈ ఫోరం కృషి చేసింది. ఇప్పటికే జిల్లాలో 6 ఉచిత కంటి వైద్య శిబిరాలను ఈ ఫోరం ఏర్పాటు చేసింది. మరో 52 కేంద్రాల్లో శిబిరాలను నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. దీని తర్వాత జిల్లాకు చెందిన ఎన్.ఆర్.ఐ.లను, మేధావి వర్గాన్ని ఏకతాటిపై నడిపేందుకు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్‌తో, జిల్లాలోని ఎమ్మెల్యేలతో తరచూ టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్‌లో సోమవారం కొందరు ప్రధానోపాధ్యాయులతో వారు సమావేశమయ్యారు.

విద్యాశాఖ సహకారంతో ఈ సమావేశాన్ని స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేశారు. పాఠశాలల ప్రగతిని స్వయంగా తెలుసుకోవడంతోపాటు ఆ పాఠశాలల అభివృద్ధికి ముందుకు వచ్చే ప్రధానోపాధ్యాయులకు సహకరించేందుకు ఎన్.ఆర్.ఐ.లు సిద్ధమయ్యారు. హెడ్మాస్టర్లు ముందుకొస్తే ఆ పాఠశాలకు కావాల్సిన ల్యాబ్, గ్రంథాలయం తదితర సౌకర్యాలను వీరు సమకూర్చుతారు. ఈ సమావేశంలో డిఈఓ అబ్దుల్ హామీద్‌తో పాటు డిప్యూటీ ఎ.పి.సి. రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ఎన్.ఆర్.ఐ.ల తరపు నుంచి ఖిల్లా ఘనపూర్ మండలం మానాజిపేటలో జన్మించి అమెరికాలో స్థిరపడిన మేరెడ్డి రవిప్రకాష్, కొల్లాపూర్‌లో జన్మించి విదేశాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్న విమల, కొల్లాపూర్‌లోనే జన్మించి హైద్రాబాద్‌లో సామాజిక సేవలో పాల్గొంటున్న రామచంద్రుడు ఈ సమావేశానికి హాజరయ్యారు.

గ్రామాల వారీగా సర్వే

ముందుగా జిల్లాలోని గ్రామాల వారీగా సర్వే జరపాలని ఈ ఫోరం నిర్ణయించింది. తద్వారా గ్రామాల్లో ఉన్న వనరులు, లేని సౌకర్యాలు, ఆ గ్రామాల నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన వారి వివరాలు, తదితర సమాచారమంతా సేకరిస్తారు. దీనికి ముందుగా రెండు మండలాలను పైలెట్ పద్ధతిలో ఎంపిక చేస్తున్నారు. (మిగతా 15లో)

VAARTHA-1

ఇది కథ!

వేసవి వస్తుందిగా విద్యుత్ కోత కూడా భారీగా ఉండబోతోందేమో

VAARTHA-2

(మొదటి పేజీ తరువాయి)

ఈ మండలాల్లోన్ని అన్ని గ్రామాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తారు. ఆ తర్వాత ఈ గ్రామాల వికాసానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటారు. దీనికిగాను అవసరమైతే మన దేశంలో ఉంటున్న పాలమూరు వాసుల సహకారం కూడా తీసుకోవాలని యోచిస్తున్నారు. హైద్రాబాద్, మద్రాస్, ముంబాయి, కోల్‌కత్తా, చెన్నై, ఢిల్లీ, గోవా, పాండిచ్చేరి, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న పాలమూరు జిల్లా వాసుల సమాచారాన్ని కూడా సేకరించడానికి ఈ ఫోరం నిర్ణయించింది. వీరిని కూడా పాలమూరు అభివృద్ధిలో సంపూర్ణ భాగస్వాములను చేయడానికి ప్రణాళికను తయారు చేస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం జిల్లాలోని కొందరు స్వచ్ఛంద సంస్థల వారితో ఈ ఫోరం సమావేశం జరిపింది. హన్వాడ, మానాజిపేట తదితర ప్రాంతాల్లో ఆర్.బి.సి.లను కూడా తనిఖీ చేసింది. సేవా భారతి ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్.బి.సి. పిల్లల అభివృద్ధికి చేయూత నిచ్చేందుకు ముందుకు వచ్చింది.

త్వరలో ఎన్.ఆర్.వి. క్లబ్

ఇతర దేశాల్లో స్థిరపడిన వారితోనే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా స్థిరపడిన పాలమూరు వాసులను ఏకం చేసేందుకు ఈ ఫోరం ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగానే త్వరలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) క్లబ్‌ను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని స్థూలంగా ఒక నిర్ణయానికి వచ్చారు. దీనికిగాను అవసరమైన సమాచారాన్ని జిల్లాలోని మేధావులు, విద్యావేత్తలు, ప్రముఖులు, అధికారుల నుంచి సేకరించాలని భావిస్తున్నారు. ఇదే గనక జరిగితే దేశంలోనే తొలిసారిగా ఎన్.ఆర్.వి. క్లబ్‌ను ఏర్పాటు చేసిన ఘనత పాలమూరు ఎన్.ఆర్.ఐ.లకే దక్కుతుంది. ఈ క్లబ్‌లోని సభ్యులతో వారి సొంత గ్రామాలనే ఎక్కడికక్కడ అభివృద్ధి పరచాలన్నదే ప్రాథమిక లక్ష్యంగా పెట్టుకున్నారు. షాద్‌నగర్‌లో చెత్త

జననీ జన్మభూమిశ్చ

ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంటును ఏర్పాటు చేసే ఆలోచనలో కూడా ఎన్.ఆర్.ఐ.లు ఉన్నారు.

పాలమూరు అభివృద్ధికై 25న ఎన్.ఆర్.ఐ.ల సదస్సు

జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించడానికి ఈనెల 25న పాలమూరు ఎన్.ఆర్.ఐ. ఫోరం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ ఫోరంకు చెందిన మేరెడ్డి రవిప్రకాష్, ప్రొఫెసర్ విమల, రామచంద్రుడు తెలిపారు. జిల్లాలోని పాఠశాలలకు సౌకర్యాలు కల్పించడానికి ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన సందర్భంగా మహబూబ్‌నగర్‌లో సోమవారం వారు విలేకర్లతో మాట్లాడారు.

స్థానిక జె.పి.ఎన్.సి.ఇ. ఇంజనీరింగ్ కళాశాలలో ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సదస్సుపై జె.పి.ఎన్.సి.ఇ. ఛైర్మన్ కె.ఎస్.రవికుమార్‌తో చర్చించామని వెల్లడించారు. జిల్లాలోని మేధావులను, విద్యావేత్తలను, ఇతర ప్రముఖులందరినీ ఈ సదస్సుకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సు ద్వారా జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహనకు వస్తామని అన్నారు. అనంతరం ఏ రకంగా జిల్లా అభివృద్ధికి తాము ఉపయోగపడవచ్చో తెలుసుకుంటామని చెప్పారు.

దాని ప్రకారం వీలైనంత వరకు చేయూతనిస్తామని వెల్లడించారు. కేవలం డబ్బుతోనే కాకుండా మానవ వనరుల సమీకరణ ద్వారా కూడా జిల్లా అభివృద్ధికి పాటు పడతామని చెప్పారు. హెడ్మాస్టర్లు ముందుకొచ్చిన ప్రాంతాల్లో మోడల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. ప్రధానంగా గ్రామాల వారిని సమీకరించడం, వారి బాధ్యతలను తెలుసుకునేలా చేయడం ముఖ్యంగా భావించామని చెప్పారు. దీని వల్ల పాఠశాలల, ఇతర ప్రభుత్వ సౌకర్యాల మెరుగుదలకు మార్గం ఏర్పడుతుందని చెప్పారు. మహబూబ్‌నగర్‌లో ఇక నుంచి ప్రతినెలా విద్యార్థులకు ఒక భారీ సదస్సును కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. దేశంలోని ప్రముఖ వ్యక్తులను మహబూబ్‌నగర్‌కు రప్పించి వారి అనుభవాలను ఇక్కడి విద్యార్థులకు తెలిసేలా చేస్తామని అన్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్ తదితర విద్యార్థులకు దీనివల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. ప్రతినెలా ఒక ప్రముఖ వ్యక్తిని పరిచయం చేయడం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేయాలన్నదే తమ ఫోరం లక్ష్యమని చెప్పారు. తమ ఫోరం కార్యక్రమాలకు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, మేధావులు, విద్యావేత్తల సహకారాన్ని కోరుతున్నట్లుగా వారు వివరించారు. పార్టీలతో ప్రమేయం లేకుండా తమ ప్రాంత అభివృద్ధి కోసమే ఈ ప్రయత్నం చేస్తున్నామని వారన్నారు.